

# దేవర అడిగినాడంటే.. చెప్పినాడని అర్థం

'భయం పోవాలంటే దేవుడి కథ ఇనాలా.. భయం అంటే ఏంటో తెలియాలంటే దేవర కథ ఇనాల'.. రీసెంట్‌గా విడుదల చేసిన ఎన్టీఆర్ 'దేవర' ట్రైలర్‌లో డైలాగ్ ఇది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఆదివారం జరగాల్సిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అనుకోని కారణాల క్యాన్సిల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ అద్భుతమైన మాస్ డైలాగులతో, విజువల్‌గా గూజ్ బంప్స్ తెప్పించేలా ఉంది. 'దేవర అడిగినాడంటే.. చెప్పినాడని అర్థం..' లాంటి డైలాగులు ట్రైలర్‌లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. రత్నవేల్ విజువల్స్, అనిరుథ్ ఆర్ఆర్, కొరటాల శివ రైటింగ్, గ్రాండ్ విజువల్స్, వీఎఫ్ఎక్స్ సినిమాకు హైలైట్స్‌గా నిలుస్తాయని నిర్మాతలు చెబుతున్నారు. ఈ చిత్రానికి సమర్పణ: నందమూరి కల్యాణ్‌రామ్, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ, నిర్మాణం: ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్.

**ఇదిలావుంటే..** దేవర సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ క్యాన్సిలైన సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులకోసం ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో ఆయన మాట్లాడుతూ ' 'దేవర' ప్రీరిలీజ్ ఈవెంట్ క్యాన్సిల్ అవ్వడం వల్ల మీకంటే నేనే ఎక్కువ బాధపడుతున్నా. ఈ ఈవెంట్‌లో 'దేవర' అనుభవాలన్నీ మీతో పంచుకోవాలని ఆశించాను. కానీ.. సెక్యూరిటీ ప్రాబ్లమ్ వల్ల ఈవెంట్‌ని క్యాన్సిల్ చేయాల్సివచ్చింది. ఈ నెల 27న థియటర్లలో కలుద్దాం. మీకు ఆనందాన్ని పంచేందుకు ఎంతో కష్టపడి 'దేవర' చేశాను. ఎంతో ఇష్టపడి కొరటాల శివ ఈ సినిమా తీశారు. అది రేపు థియేటర్లలో మీరు చూస్తారు' అని తెలిపారు.

# షారుక్ అభిమానులకు శుభవార్త



**కింగ్‌ఖాన్** అభిమానులకు రచయిత అబ్బాస్ రైటేవాలా శుభవార్త చెప్పారు. పరాజయాలతో విసిగిపోయిన షారుఖ్‌ఖాన్‌కి గ్రేట్ కంబ్యాక్ అందించిన సినిమా 'పఠాన్'. అయిదేళ్ల విరామం తర్వాత షారుఖ్‌కి దక్కిన అపూర్వ విజయం అది. షారుఖ్ కెరీర్‌లో వెయ్యికోట్ల క్లబ్‌లో చేరిన తొలి సినిమాగా 'పఠాన్'ని చెప్పుకోవాలి. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రకటించిన నాటినుంచి దానికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే.. ఎట్టకేలకు ఈ సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్ వచ్చేసింది. 'పఠాన్' రచయిత అబ్బాస్ టైరేవాలా ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ 'పఠాన్ 2' స్క్రిప్ట్ వర్క్ దాదాపుగా పూర్తయింది. డైలాగ్ వెర్షన్ మాత్రమే మిగిలివుంది. యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమా గత చిత్రాలను మించేలా ఉంటుంది. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఈ ఏడాది చివరి నాటికి షూటింగ్ మొదలుపెట్టాలని భావిస్తున్నారు.' అని తెలిపారు.



# అలా ఎలా జడ్జ్ చేస్తారు?

'యానిమల్'ఫేం త్రిప్తి డిమ్రీకి ఊహించని ప్రశ్న ఎదురైంది. ఈ ప్రశ్న తనను ఎంతో బాధించింది కూడా. అందుకే ఘాటైన సమాధానమిచ్చింది. వివరాల్లోకెళ్తే.. 'యానిమల్, బ్యాడ్ న్యూస్ చిత్రాల్లో ఘాటైన సన్నివేశాల్లో సెమీ న్యూడ్‌గా నటించిన త్రిప్తి డిమ్రీని ఎవరైనా పెళ్లి చేసుకుంటారా? అంటూ ఒక నెటిజన్ ఎక్స్ ఖాతా ద్వారా ప్రశ్నించాడు. దీనిపై త్రిప్తి స్పందిస్తూ.. 'మరి నాతో అర్ధనగ్నంగా నటించి, పెదవి ముద్దులతో రెచ్చిపోయిన రణబీర్ క్యారెక్టర్‌ని ఎందుకు దూషించరు? తను మగాడనా? అంటే.. మగాడు ఎలాగైనా చేయొచ్చు. పాత్రకోసం ఆడవాళ్లు చేస్తే అది పాపం!?. ఘాటైన సన్నివేశాల్లో నటించినంత మాత్రాన నిజజీవితంలోనూ అలాగే ఉంటామని ఎలా జడ్జ్ చేస్తారు? ఏది చూడాలో.. ఏది చూడకూడదో ఎంచుకునే హక్కు ప్రేక్షకులకు ఉంది. అంతేకానీ ఒకరిని దూషించే హక్కు మాత్రం ఎవరికీ లేదు. మగాళ్లను ఒకలా, ఆడాళ్లను ఆకలా చూడటం మానుకోండి. వెండితెరపై రొమాన్స్ చేయడంలో ఆడా, మగా ఇద్దరిదీ సమాన పాత్ర అని తెలుసుకోండి.' అంటూ విరుచుకుపడింది త్రిప్తి డిమ్రీ.



# మెల్‌బోర్న్‌లో ఆటపాట

**నితిన్** నటిస్తున్న కామెడీ యాక్షన్ ఎంటర్టైనర్ 'రాబిన్ హుడ్'. శ్రీలీల కథానాయిక. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో మొదలైంది. నితిన్, శ్రీలీలపై డ్యూయెట్‌ని షూట్ చేస్తున్నారు. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను జీవి ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. మెల్‌బోర్న్‌లోని అద్భుతమైన లొకేషన్లలో ఈ పాటను చిత్రీకరిస్తున్నామని, నితిన్, శ్రీలీల కెమిస్ట్రీ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ పాటతో పాటు బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్‌తో సహా ప్రధాన తారాగణంతో కూడిన ముఖ్యమైన టాకీ పార్ట్‌ని కూడా అక్కడే చిత్రీకరిస్తారు. డా.రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్.



# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో అగ్ర నటుడు చిరంజీవికి చోటు

**156 సినిమాలు.. 537 పాటలు.. 24వేల స్టెప్పులతో సాధించిన ఘనత..**

**గిన్నిస్ ప్రతినిధుల సమక్షంలో ఆమిర్‌ఖాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చిరంజీవి..**

'ఈ గిన్నిస్ రికార్డు నేను ఊహించింది కాదు. డ్యాన్స్‌పై నాకున్న ఆసక్తే ఈ అవార్డును నాకు దక్కేలా చేసిందని భావిస్తున్నా. తొలినాళ్లలో నటనకంటే డ్యాన్స్‌నే ఎక్కువ ఇష్టపడేవాణ్ని. రేడియోలో పాటలు వింటూ డ్యాన్స్ చేస్తుండేవాణ్ని. ఎన్‌సీసీలో చేరాక కూడా భోజనం పూర్తయ్యాక ప్లేట్‌తో డప్పు కొడుతూ స్టెప్పులేసేవాణ్ని. నటుడిగా తొలి అడుగులు పడుతున్న రోజుల్లో డ్యాన్స్ చేస్తూ కాలు జారి కిందపడిపోయాను. అప్పుడు లొకేషన్లో ఉన్న సావిత్రిగారు, నరసింహరాజు, రోజారమణి నన్ను చూసి 'అయ్యో' అంటూ జాలి పడుతుంటే.. కిందపడ్డ నేను.. సమయస్ఫూర్తితో దాన్ని నాగిని డ్యాన్స్‌గా మార్చేశా.. అప్పుడు అందరూ తెగ మెచ్చుకున్నారు.' అంటూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు అగ్ర నటుడు చిరంజీవి. ఆయన కీర్తి కిరీటంలోకి మరో కలికితురాయి వచ్చి చేరింది. చిరంజీవి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. 156 సినిమాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో ప్రేక్షకుల్ని విశేషంగా అలరించిన ప్రముఖ నటుడిగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల సమక్షంలో చిరంజీవికి బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తన డ్యాన్స్ ప్రస్థానాన్ని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. 'తనలోని డ్యాన్స్ స్కిల్ తెలుసుకొని 'ప్రాణం ఖరీదు'లో నాకోసం ప్రత్యేకంగా డ్యూయెట్‌ని క్రియేట్ చేశారు క్రాంతికుమార్. నా డ్యాన్స్ కోసం ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారంటూ అప్పటి దర్శక, నిర్మాతలకు డిస్ట్రిబ్యూటర్ లింగమూర్తి నన్ను రికమండ్ చేసేవారు. నా డ్యాన్స్, నా పాటలు ఇవే నా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ప్రపంచప్రఖ్యాతి గాంచిన గిన్నిస్ రికార్డ్స్‌లో నాకు చోటు దక్కడం భాగ్యంగా భావిస్తున్నా. ఒక్క ఫోన్ కాల్‌తో ఆహ్వానించగానే ఈ వేడుకు విచ్చేసిన మిత్రుడు ఆమిర్‌ఖాన్‌కు ధన్యవాదాలు' అన్నారు చిరంజీవి. ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ 'నేను చిరంజీవికి పెద్ద అభిమానిని. ఈ వేడుకకు పిలిచినప్పుడు 'విజ్ఞప్తికాదు ఆర్డర్ వేయండి' అని చెప్పాను. ఈ వేడుకలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ప్రతి పాటనూ ఆస్వాదించి నర్తిస్తారాయన . అందుకే ఈ గౌరవం' అని కొనియాడారు. ఇంకా కె.రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, సి.అశ్వనీదత్, డి.సురేశ్‌బాబు, కె.ఎస్.రామారావు, తమ్మారెడ్డి భరద్వాజ్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గుణశేఖర్, బాబీ, జెమినీ కిరణ్, మైత్రీ రవిశంకర్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

## కేటీఆర్ అభినందన

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్** కల్వకుంట్ల తారకరామారావు తన ఎక్స్ (ట్విటర్) ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న అగ్ర నటుడు చిరంజీవికి అభినందనలు అందించారు. 'అరంగేట్రం నుంచి ఆధిపత్యం వరకు చిరంజీవిగారి నట ప్రయాణం అపురూపమైనది. 1978లో ఇదే రోజున 'ప్రాణంఖరీదు' సినిమాతో ఆయన తెలుగు తెరపై మెరిశారు. 46ఏండ్ల అనితరసాధ్యమైన నటప్రస్థానంతో తెలుగు సినిమాపై తనదైన ముద్ర వేశారు. తెలుగు సినిమా గర్వించదగ్గ మహానటుడిగా, గొప్ప స్టార్‌గా అవతరించిన ఆయనకు గిన్నిస్ రికార్డ్‌లో స్థానం దక్కడంతో అభిమాన లోకం పండుగ జరుపుకుంటున్నది. 156 సినిమాలు.. 537 పాటలు.. 24000 డాన్స్ మూమెంట్స్.. లెక్కలేనన్ని జ్ఞాపకాలతో కొన్ని కోట్లమందిని రెండుమూడు తరాలుగా మీరు స్ఫూర్తి నింపుతూనే ఉన్నారు. అభినయంతో నేటికీ మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనేవున్నారు. మీరు ప్రైడ్ ఆఫ్ తెలుగు సినిమా.' అంటూ కేటీఆర్ తన ఎక్స్(ట్విటర్) ద్వారా చిరంజీవిని కొనియాడారు. ఇంకా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులైన రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కూడా చిరంజీవికి శుభాకాంక్షలు అందించారు.

## పెళ్లి అనగానే

# హెచ్చరికలు చాలా వచ్చాయి



'మనిషిగా పెరుగుతూ, మానసికంగా ఎదుగుతూ ముందుకెళ్లాను. అనుకున్నది సాధించడం, దాని కోసం ఎంతైనా శ్రమించడం నా నైజం. ఒకరితో మంచిచెడూ చెప్పించుకోవడం నాకు ఇష్టం ఉండదు. నాజీవితంపై నాకు ఓ అవగాహన ఉంది' అన్నారు బాలీవుడ్ నటి కరీనా కపూర్. తాజా ఇంటర్వ్యూలో తన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను ఆమె పంచుకున్నారు. 'కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే సైఫ్ అలీఖాన్‌ని పెళ్లాడాలని నిశ్చయించుకున్నా. నా నిర్ణయం బహిర్గతం కాగానే.. నా చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి నాకు చాలా హెచ్చరికలు వచ్చాయి. కొందరైతే పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసిపోయినట్టే అని భయపెట్టడానికి ప్రయత్నించారు. నేను ఎవరి మాటలూ లెక్క చేయలేదు. కెరీర్ ముగిసిపోవాలని రాసుంటే మనం మాత్రం ఏం చేయగలం? అంటూ వారిని ఎదురు ప్రశ్నించా. నిజానికి పెళ్లయ్యాకే నేను ఎక్కువ వర్క్ చేశా. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లా. నా వర్క్‌లైఫ్‌పై ఆసక్తి పెంచుకున్నా. నన్ను నేను నమ్ముకోవడం వల్లే ఈ విజయం నాకు సాధ్యమైంది' అంటూ చెప్పుకొచ్చింది కరీనా కపూర్.



# పిచ్చి పనులు మానండి

'**క్రియేటర్ల** హక్కులను గౌరవించండి. కాపీ రైట్స్ ఉల్లంఘించకండి.. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవ్' అంటూ హెచ్చరికలు జారీ చేశారు ప్రముఖ దర్శకుడు శంకర్. వివరాల్లోకెళితే.. తమిళ రచయిత వెంకటేశన్ రాసిన 'నవయుగ నాయగన్ వేళ్ పారి' నవల కాపీరైట్స్‌ని గతంలోనే శంకర్ దక్కించుకున్నారు. ఆ నవలలోని సన్నివేశాలను ఓ సినిమాలో వినియోగించడం చూసి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓ కొత్త సినిమా ట్రైలర్ చూశా. అందులో 'నవయుగ నాయగన్ వేల్ పారి' నవలలోని ముఖ్యమైన సన్నివేశాన్ని వాడేశారు. చూసి షాక్ అయ్యా. ఆ నవలపై కాపీరైట్స్ నావి. నా అనుమతి లేకుండా ఆ నవలను ఎలా వాడతారు? హక్కుదారుని అనుమతి లేకుండా సినిమాలకుగానీ, వెబ్ సిరీస్‌లకు గానీ, మరే ఇతర ప్లాట్‌ఫామ్స్‌లో కానీ నవలలోని సన్నివేశాలను ఉపయోగించడం నేరం. ఇలాంటి పిచ్చిపనులు మానండి.' అంటూ హెచ్చరించారు శంకర్. అయితే.. ఏ సినిమా ట్రైలర్‌లో నవల ఆధారిత సన్నివేశం ఉందో ఆయన వెల్లడించలేదు.

# మీ హద్దుల్లో మీరుండండి

STOP.. ఇది చాలా శక్తివంతమైన పదం.. ఇకనైనా ఆపండి.. అంటూ ఘాటుగా స్పందించారు సీనియర్ నటి సిమ్రాన్. సోషల్‌మీడియాలో తనపై వస్తున్న వార్తలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇన్నాళ్లుగా నన్ను ఎవరో ఒకరితో ముడిపెడుతూ సోషల్‌మీడియాలో వార్తలు రాస్తూనే ఉన్నారు. అవేమీ పట్టించుకోకుండా నిశ్శబ్దంగా నా పని నేను చేసుకుంటూ వెళ్తున్నాను. కానీ నా నిశ్శబ్దాన్ని చేతకానితనం అనుకుంటున్నారు. అందుకే ఇప్పుడు అన్నింటికీ స్పష్టత ఇస్తున్నా. ఏ పెద్ద హీరోతో పనిచేయాలన్న కోరిక నాకు లేదు. ఇప్పటికే వారితో చాలా సినిమాలు చేశా. ఇప్పుడు నా లక్ష్యాలు వేరు. ఎవరూ హద్దులు దాటొద్దు. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే క్షమించను. నాపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నవాళ్లు వెంటనే నాకు క్షమాపణలు చెప్పాలి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.' అంటూ హెచ్చరించారు సిమ్రాన్.



# ఏఐతో 'శారీ' సంగీతం



**రామ్‌గోపాల్‌వర్మ** డెన్ నుంచి 'శారీ' అనే సైకలాజికల్ థ్రిల్లర్ రాబోతున్న విషయం తెలిసిందే. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో రవివర్మ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లు. నవంబర్‌లో సినిమా విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా ద్వారా ఓ కొత్త ప్రయోగానికి రామ్‌గోపాల్‌వర్మ శ్రీకారం చుట్టారు. ఆర్టిఫిషల్ ఇంటలిజన్స్(ఏఐ) ప్రస్తుతం సాంకేతిక విప్లవానికి తెరలేపిన విషయం తెలిసిందే. ఈ కృత్రిమమేథ సప్తస్వరాలతో విన్యాసాలు చేస్తూ సంగీతకారులందరికీ సవాలు విసురుతోంది. దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తన 'శారీ' చిత్రంలో తొలిసారి ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ప్రక్రియతో మ్యూజిక్ డిపార్ట్మెంట్‌తో పనిలేకుండా తానే సంగీత, సాహిత్య, వాయిద్య మేళవింపుగా పాటను తయారు చేశారు. 'ఐ వాంట్ లవ్..' అంటూ సాగే ఈ పాటను ఆదివారం ఉదయం విడుదల చేశారు. భారత చలనచిత్ర చరిత్రలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ప్రక్రియ ద్వారా తయారైన తొలి సినిమా పాట ఇదే కావడం విశేషం. ఇకపై భవిష్యత్‌లో సంగీత దర్శకులు, పాటలు రాసేవాళ్లు, పాడేవాళ్లు చరిత్రగా మిగిలిపోతారనీ, రూపాయి ఖర్చు లేకుండా ఏఐ యాప్ ద్వారా సంగీతాన్ని తమకు ఇష్టమైన ట్యూన్స్‌లో సమకూర్చుకోవడమే కాక, వాటిని తమకు ఇష్టమైన వాయిస్‌లో క్షణాల్లో రికార్డ్ చేసుకోవచ్చని రామ్‌గోపాల్‌వర్మ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శబరి, నిర్మాణం: ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్.

